కలెక్టర్, ఎస్‌పిలను కలిసిన పాలకొండ సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పాలకొండ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన సి.యశ్వంత్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ ను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

అనంతరం జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయన్ను అభినందిస్తూ డివిజన్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని సక్రమంగా ప్రజలకు సేవలందిస్తూ వారి మన్ననలను పొందాలని కోరారు.

వేతన జీవులపై రాజకీయ పిడుగు

టిడిపి నాయకుల ఒత్తిళ్లతో విఒఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు
జియ్యమ్మవలసతో మొదలైన వేధింపులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో అట్టడుగు వేతన జీవులపై రాజకీయ పిడుగులు పడుతున్నాయి. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే నాయకుల వేధింపులు మొదలయ్యాయి. చిరుద్యోగుల పొట్టకొట్టి తమ పార్టీకి చెందిన అభిమానుల, కార్యకర్తల పొట్ట నింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏళ్లతరబడి పనిచేస్తున్న గ్రామైక్య సంఘాల విఒఎలను, ఉపాధిహామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగింపు కార్యక్రమాన్ని టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు ప్రారంభించారు. స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యేల అండతో మండల స్థాయి నాయకులు విఒఎ, ఫీల్డ్ అసిస్టెంట్లే లక్ష్యంగా వేధింపులు మొదలుపెట్టారు. పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే జిల్లాలోని జియ్యమ్మవలస మండలంలో తొమ్మిది విఒఎలను తొలగించాలని ఎంపిపి బి.సురేష్ మండల ఎపిఎంపై ఒత్తిడి పెంచారు. సాక్ష్యాత్తు అధికారపార్టీ ఎంపిపి ఒత్తిడి చేస్తుంటే తట్టుకోలేక మండల అధికారి ఆ 9 మంది విఒఎలను పక్కనపెట్టి కొత్త వ్యక్తులను నియమించే పనిలో పడ్డారు. గ్రామస్థాయిలో ఉండే ఉద్యోగుల్లో విఒఎలు అతి తక్కువ జీతానికి పని చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.8వేలు గౌరవ వేతనం మంజూరు చేస్తుంది. ఆ వేతనం కూడా నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం లేదు. గ్రామైక్య సంఘాల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తే సంఘం అధ్యక్షులు చెల్లిస్తారు. పది నుంచి 20 డ్వాక్రా సంఘాల సమూహమే గ్రామైక్య సంఘం. ప్రతి గ్రామైక్య సంఘానికి ఒక విఒఎ వుంటారు. గ్రామైక్య సంఘాల ఆర్థిక లావాదేవీలు, రికార్డుల నిర్వహణ వంటి పనులు చేసే విఒఎలు వెలుగు శాఖలో అత్యంత కీలకమైన చిరుద్యోగులుగా వున్నారు. ఇలాంటివారిపై అధికారపార్టీ నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వీరే తొలి బలిపశువు లుగా మారుతున్నారు. ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లోనే పని చేస్తున్నప్పటికీ రాజకీయ పగ, ప్రతీకారం తీర్చుకునే లక్ష్యంతో వీరిపైనే దృష్టి సారిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి వేధింపులు, తొలగింపులు జరిగాయి. అదే దారిలో ఇప్పుడున్న కూటమి ప్రభుత్వ నాయకులు కూడా నడుస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వానికి భిన్నంగా సుపరిపాలన అందిస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన టిడిపి నాయకులు 'దొందూదొందే' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

తొలగించే అధికారం ఎవరిది?

గ్రామైక్య సంఘాల కనుసన్నల్లో పని చేస్తున్న విఒఎలను తొలగించే అధికారం ఆ సంఘాలకే వున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామైక్య సంఘాల కార్యకలాపాలు నిర్వహిస్తున్న విఒఎలను తొలగించాలంటే మెజారిటీ సంఘాలు తీర్మానం చేయాల్సి ఉంటుంది. అయితే డ్వాక్రా సంఘాల్లో గల మహిళలు కూడా పింఛను, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా వుంటారు. దీంతో మండల, గ్రామ స్థాయి నాయకులు సంఘాల్లోని మహిళలను బెదిరించి విఒఎల తొలగింపు కోసం ఒత్తిడి పెంచడం ఎక్కువగా కనిపిస్తోంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి మెజారిటీ సంఘాల సభ్యులు తొలగించాలని తీర్మానం చేస్తే అధికారులు విఒఎలను తొలగించే అవకాశం ఉంది. అయితే అలాంటి తీర్మానాలు లేకుండానే టిడిపి నాయకులు మండల ఎపిఎంలపై ఒత్తిడి పెంచి తొలగించే ందుకు ప్రయత్నిస్తున్నారు. జియ్యమ్మ వలస మండలంలోనూ ఎంపిపి ఒత్తిడి మేరకే ఎపిఎం 9మంది విఒఎలను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే పార్వతీపురం మండలం ఎంఆర్ నగరంలో గజవదన గ్రామైక్య సంఘం విఒఎగా డొంకాడ మహేశ్వరరావు ఏడేళ్లుగా పని చేస్తున్నారు. గ్రామసర్పంచ్ వంగపండు లక్ష్మి, ఆమె భర్త త్రినాధనాయుడు విఒఎ మహేశ్వరరావును తొలగించాలని ఒత్తిడి పెంచారు. ఆ ఒత్తిడి మేరకే ఎపిఎం ఆయన్ను పక్కనపెట్టారు. ఆయనతో పని చేయించడం లేదు. అయితే గజవదన గ్రామైక్య సంఘం సభ్యుల మద్దతు పూర్తిగా మహేశ్వరరావుకే వుంది. కానీ ఎపిఎం మాత్రం రాజకీయ ఒత్తిడి కారణంగా విఒఎ మహేశ్వరరావును తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలో మిగిలిన మండలాల్లోనూ గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎవరిపై ఎప్పుడు వేటుపడుతోందనని బడుగు జీవుల గుండెల్లో గుబులు రేగుతోంది. అలాగే నాయకుల తీరుపైగా కూడా సర్వత్రా విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. నాయకులు తమ తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో గత ప్రభుత్వానికి పట్టిన గతే తప్పదన్న చర్చ కూడా ఉంది.

దోమలను నివారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

దోమలను నివారించాలని, తద్వారా వ్యాధులను అరికట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం కొత్తవలస దుర్గగుడి చెరువులో దోమల లార్వాను నివారించేందుకు గంబూషియా చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి వ్యాధులకు ప్రధాన కారణం దోమలని, వీటన్నింటిని నివారించేందుకు సమగ్రమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో లక్షా 50వేల గంబూషియా చేప పిల్లలను దోమల లార్వాలు పెరుగుటకు అవకాశం ఉన్న నీటి వనరుల్లో విడుదల చేస్తున్నట్లు చెప్పారు. దోమలు నివారణకు వ్యక్తిగతంగా కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత అత్యావస్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు, ఇతర కారకాలను వినియోగించడం ద్వారా దోమ కాటు నుంచి దూరంగా ఉండొచ్చని చెప్పారు. దోమలు వ్యాప్తి కాకుండా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

చెరువులో గంబూషియా చేప పిల్లలను విడిచిపెడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

మలేరియా, డెంగీ వ్యాధులకు అవకాశాలు ఎక్కువగా ఉన్న జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో 349 చెరువుల్లో గంబూషియా చేప పిల్లలను విడుదల చేశామని ఆయన చెప్పారు. తద్వారా జీవాధార (బయలాజికల్) విధానంలో దోమల లార్వాను నియంత్రించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె విజయ పార్వతి, డిప్యూటీ డిఎంహెచ్ఒ టి జగన్మోహన్రావు, మత్స్యశాఖ అభివద్ధి అధికారి డబ్బీరు గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పంచాయతీలో గల కోనేటి చెరువులో గంబూషియా చేపలను సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు విడుదల చేశారు. నీటి కుంటల్లోనూ, చెరువుల్లో దోమ లార్వాని తినడానికి ఈ చేపలను ప్రతి ఏడాది వర్షాకాలంలో చెరువుల్లో విడిచి పెడుతుంటారన్నారు. మండలంలోని అన్ని చెరువుల్లో గాంబూషియా చేపలను వైద్య సిబ్బంది విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం అలేఖ్య, హెల్త్ అసిస్టెంట్ రమేష్, భారతి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

సరిపడా పడకలు ఏర్పాటు చేయాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు సరిపడా పడకలు ఏర్పాటు చేయాలని, అలాగే అదనపు భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతి రావు డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు హాస్పల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ ఏజెన్సీలో వచ్చే అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యమందించి, మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఏజెన్సీ అంతటా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధులు, రక్తహీనతతో గిరిజనులు రోగాలు బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు లేకపోవడంతో గిరిజనులకు మెరుగైన వైద్యమందడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన సేవలందించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు సరిపడా పడకలు ఏర్పాటు చేయాలన్నారు. కేసులు రిఫరల్ చేయకూడదని, బ్లడ్ బ్యాంకు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. స్కానింగ్‌తో పాటు అన్ని రకాలు పరీక్షలు నిర్వహించేందు ల్యాబ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రోగులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అన్ని మందులు ఆస్పత్రిలోనే ఉండేలా చూడాలన్నారు. అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సర్పంచ్ జె.సుందరమ్మ, సిపిఎం నాయకులు శ్రీరాములు, పి.సాంబయ్య, కామేష్, ఎ.గంగారావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

వర్షాల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. వర్షాలు కురిసే అవకాశం, ఒడిషాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడం పట్ల అధికారులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదల పరిస్థితిని గమనించాలని చెప్పారు. వసతి గృహాలను తనిఖీ చేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ ఉండరాదని ఆయన ఆదేశించారు. వరదలు వచ్చేటప్పుడు, వానలు కురిసేటపుడు సెల్ఫీలు తీసుకోవడానికి, వరదల్లో ఈత కొట్టడానికి ఎవరూ ప్రయత్నించొద్దని ఆయన కోరారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. విపత్తులు సంభవించే అవకాశాలున్న ప్రదేశాలు వద్ద పూర్తి అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గెడ్డలు, వాగులు, వంకలు పొంగే ప్రదేశాలు ఉంటాయని, ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ప్రదేశాల్లో పోలీసు, వాలంటీర్లు లేదా ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలన్నారు. గత అనుభవాల దష్ట్యా అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్ లు పడిపోయే అవకాశం ఉన్న భవనాలు, మట్టి ఇళ్లలో ఉన్న వాటిని సురక్షిత భవనాల్లోకి మార్చాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

పాలకొండ లో కుండపోత వర్షం
జలమయమైన కాలనీలు

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని శుక్రవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారిపైన ఉన్న డ్రైనేజ్ పొంగిపొర్లుతున్నాయి. అలాగే పట్టణంలోని గాయిత్రీనగర్, గారమ్మ కాలనీ తదితర వీధులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రతి ఏటా తమ కాలనీ పరిస్థితులు ఇంతేనని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు. లేకుంటే సమీప భవిష్యత్తులో తమ కాలనీ కూడా మరో విజయవాడ కావటం ఖాయమని అందోళన చెందుతున్నారు.

ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

వాగులో చిక్కుకుపోయిన జిసిసి సరుకుల ట్రాక్టర్

ప్రజాశక్తి - సాలూరు రూరల్

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు జిసిసి ద్వారా సరుకులు తీసుకెళ్తున్న ట్రాక్టర్ వాగులో చిక్కుకొని బోల్తాపడింది. ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కురుకూటి జిసిసి డిపో పరిధిలో గల మారుమూల గ్రామాలైన మూల్తాడి వలస, దొర్లతాడివలస గ్రామాలకు ప్రతి నెలా కార్డుదారులకు ఆ గ్రామాలకు వెళ్లి నిత్యవసర సరుకులను ఇస్తుంటారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆ గ్రామాలకు నిత్యవసర సరుకులను తీసుకెళ్లేందుకు కురుకుట్టికి చెందిన చిప్పాడ శివ ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకెళ్లి ఆ సరుకులు అక్కడ పంపిణీ చేశారు. తిరిగి అంగన్వాడీ కేంద్రానికి చెందిన సరుకులను తీసుకొని వస్తుండగా ఒడిస్సాలో కురుస్తున్న భారీ వర్షాలకు సువర్ణముఖి నదిపై దండిగాం, కురుకూటి మధ్య గల కాజువే ఉధృతంగా ప్రవహిస్తుంది. అప్పటికే కాజ్‌వే మధ్యలోకి వెళ్లిన ట్రాక్టర్ ఆ ప్రవాహానికి బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్ శివ చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఈ వాగు వద్ద వంతెన నిర్మించాలని అనేక ఏళ్లుగా పాలకులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతోందని వాపోయారు. ఈ నదీ ప్రవాహం ఎక్కువైతే కురుకూటితో పాటు సుమారు 20గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించే అవకాశం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర ఆరోగ్య సమస్యలను ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక నాయకులు స్పందించి ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

ప్రధాన రహదారి కిటకిట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రధాన రహదారి అమ్మకందారులు, కొనుగోలుదారులతో కిటకిటలాడింది. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి పూజా సామగ్రి కొనుగోలుకు పార్వతీపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల్లోని గ్రామీణ ప్రజలు పూజా సామగ్రి కొనుగోలుకు ఎగబడ్డారు. పండుగ కావాల్సిన మారేడు, ఉసిరిక, జొన్న పొత్తులు, సీతాఫలాలు, ఎలంకాయలు, వినాయకుని విగ్రహాలు అధిక సంఖ్యలో కొనుగోలు జరిగాయి. సాయంత్రం అకస్మాత్తుగా వర్షం కురవడంతో వ్యాపారాలస్తులు, కొనుగోలుదారుడు కొంత అసహనానికి గురయ్యారు. ప్రధాన రహదారిపైనే చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు సాగించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఇదిలా ఉండగా పండగను ఆసారా చేసుకొని వ్యాపారులు అమాంతంగా పూజా సామగ్రి ధరలు పెంచారు. అరటి పళ్ల డజన్ 80 రూపాయల నుంచి వంద రూపాయలు వరకు విక్రయించారు. కొబ్బరికాయ ఒక్కొక్కటి 40నుంచి 50 రూపాయల వరకు ధర పలికింది. ఒక్కొక్క యాపిల్, నారింజ 20 రూపాయలు పైనే ధర పలికింది. పూల ధరలు ఇక చెప్పనక్కర్లేదు. కేజీ రూ.400 వరకు విక్రయించారు. దీంతో తప్పని పరిస్థితుల్లో కొనుగోలుదారులు వీటిని కొనాల్సిన పరిస్థితి నెలకొంది.

కొండెక్కిన పండ్లు, పూల ధరలు

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ప్రధాన రహదారి

గుమ్మలక్ష్మీపురంలో వినాయక విగ్రహానికి తరలిస్తున్న యువత

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకల ఏర్పాట్లలో యువత సందడిగా కనిపిస్తున్నారు. శనివారం వినాయక చవితి పండగ నేపథ్యంలో పెద్ద పెద్ద విగ్రహాలను కొనుగోలు చేసి తమ గ్రామాలకు తీసుకు వెళ్తున్నారు. ఒక్కొక్క బొమ్మ ఖరీదు రూ.10000 నుంచి రూ.20,000 వరకు ధర పలికింది. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రం యువత, మహిళాలతో కిక్కిరిసింది. ప్రతి షాపు వద్ద వేలల్లో వ్యాపారం జరిగింది.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, వారికి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామనిఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖలో వివిధ హెూదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది వృత్తి, ఆరోగ్యపరమైన, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించడానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. పోలీస్ సిబ్బంది విన్నవించుకున్న సమస్యలను ఎస్పీ విని, విన్నపాలను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎస్పీ సిసి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎస్పీ మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 14న కోర్టుల్లో జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతుంది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో ఎస్‌పి జూమ్ వీడియో కాన్ఫరెన్సు ఏర్పాటు చేసి జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్ పురస్కరించుకొని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల అధికారులతో వారి వారి స్టేషన్ లకు సంబంధించి రాజీ అయ్యే కేసుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ ఇరు పక్షాల వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వీలైనంతవరకు ఎక్కువ కేసులను డిస్పోజల్ చేయాలని చెప్పి అధికారులను ఆదేవించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో ఇరుపక్షాల సమ్మతితో వారి వారి కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర కేసులను కూడా వీలైనంత వరకు ఎక్కువగా డిస్పోజల్ చేయాలని తెలిపారు. కోర్టు కేసులు పెండింగ్లో ఉన్న కక్షిదారులు వారి కేసులను లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించు కొనేలా చర్యలు చేపట్టాలని, కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని, డబ్బు ఆదా అవుతుందని, సత్వరం పరిష్కారం లభిస్తుందని తెలియజేయాలని సూచించారు. కేసులో విషయంలో వారికీ ఉన్న అపోహలు తొలగించాలని, ముఖ్యంగా ఆక్సిడెంట్ కేసుల్లో వారు రాజీ అయ్యిన వారికి రావాల్సిన పరిహారం అందుతుందని వారికి చెప్పాలని తెలిపారు. అధికారులతో ఎన్ఫోర్స్మెంట్ కేసులు,పెట్టి కేసులు ఎక్కువగా నమోదు చేసి లోక్ అదాలత్‌లో కాంపౌండ్ అయ్యేలా తగిన చర్యలను చేపట్టలని ఎస్‌పి సూచించారు.

పోలీసు సిబ్బంది నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

సబ్ కలెక్టర్‌గా యశ్వంత్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ డివిజన్ సబ్ కలెక్టర్‌గా సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2022 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన యశ్వంత్ కుమార్ రెడ్డికి ఇదే మొదటి పోస్టింగ్. ఇప్పటివరకు ఇక్కడ ఆర్డీవో గా పని చేసిన వివి రమణ కు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

పిఒగా యశ్వంత్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అందరి సహకారంతో గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు మారుమూల గిరిజన గ్రామాలకు అందేలా చర్యలు తీసుకొంటానని అన్నారు. గిరిజనులకు అందుబాటులో ఉంటామన్నారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులను మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని డిఇఒ జి.పగడాలమ్మ అన్నారు. ఇటీవల ఏర్పాటైన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులు మంతిని వాసుదేవరావు, పి.చంద్రమోహన్ బృందం శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను అనేక క్రీడా విభాగాల్లో ముందుంచాలని, అందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులంతా కలిసికట్టుగా ఉండి విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దాలని కోరారు. ఈ ఏడాది గ్రిక్స్ ఆటల పోటీలకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వై సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

డిఇఒను కలిసిన వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం

వరదబాధితులకు విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

వరద బాధితులకు సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - సీతానగరం

విజయవాడ వరద బాధితుల సహాయ నిధిని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆధ్వర్యంలో సీతానగరం ప్రధాన రహదారిలో విరాళాల సేకరణ చేశారు. రూ.4,450 సహాయనిధిని బ్యాంక్ డిడి రూపంలో వారికి చెల్లించారు. విరాళాల సేకరణలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మనాయుడు మండల కమిటీ సభ్యులు గవర వెంకటరమణ, ఆర్.రాము, వై.రామారావు, సిహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

నేత్రదానానికి 30 మంది అంగీకారం

ప్రజాశక్తి - కురుపాం

నేత్రదానానికి 30 మంది అంగీకరించినట్లు నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన నేత్రదాన పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా 30మంది ముందుకొచ్చి తమ నేత్రాలను దానం చేసేందుకు అంగీకార పత్రాలను అందజేశారన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చి ఇంకా ఎవరైనా తమ నేత్రాలను మరణానంతరం దానం చేయాలనుకుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గానీ జిల్లా అంధత్వ నివారణ సంస్థను గానీ సంప్రదిస్తే వారు తగు సూచనలు, సలహాలు ఇచ్చి అంగీకార పత్రాలను స్వీకరిస్తారని అన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు మాలిక, సిబ్బంది పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకికి చెంది దర్రు సుమన్ అనారోగ్యంతో విశాఖపట్నం కెజిహెచ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈయన నిరుపేద కావడంతో వైద్య సహాయం కోసం అదే గ్రామానికి వాడాడ ధనలక్ష్మి రూ.13500, గ్రామానికి దళిత యువకులు రూ.5వేలు అందజేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం సుమన్ కుటుంబానికి నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవనాయుడు చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పెదపెంకి యూత్ గ్రూప్‌లో గల యువతకు సంజీవనాయుడు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వాడాడ గంగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ప్రాంతాల్లో చదువురాని వయోజనులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయడం స్వచ్ఛంద సంస్థల పనితీరు అభినందనీయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని రస్తాకుంటుబాయి పంచాయితీ తోటగూడలో స్వార్డ్ సంస్థ డైరెక్టర్ బి.దయానంద్ ఆధ్వర్యంలో వయోజన విద్యా కేంద్రం లిటరసీ-ఇండియా ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేసిన విద్యా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 15 గ్రామాల్లో నిరక్షరాస్య నిర్మూలన లక్ష్యంగా వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం మంచి శుభపరిమాణమని, దీన్ని చదువు రానిటువంటి వయోజనులంతా వినియోగించుకొని అక్షరాస్యత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు మాసయ్య, చిన్నమ్మి, టిడిపి నాయకులు వెంపటాపు భారతి, కడాయి, తదితరులు పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - వీరఘట్టం

వాయుగుండం కారణంగా అతి భారీ వర్షాలు పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా నది తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఇందుకు సంబంధించి తలదాచుకునేందుకు భవనాల సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, స్థానిక వైద్యాధికారిపి ఉమామహేశ్వరి, ఎఎస్ఐ కష్ణంనాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గరుగుబిల్లి నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని గరుగుబిల్లి మండల తెలుగుదేశం నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వైసిపి నాయకులు ద్వారపురెడ్డి ధనుంజయనాయుడు మాజీమంత్రి శత్రు చర్ల విజయరామరాజు సమక్షంలో టిడిపిలో చేరడంపై వారంతా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులకు, కార్యకర్తలకు తెలియకుండా ద్వారపురెడ్డి కుటుంబ సభ్యులు టిడిపిలోకి చేరడమేమిటని ప్రశ్నించారు. దీనికి తామంతా నిరసన వ్యక్తం చేస్తూ తీర్మాన కాపీని ఎమ్మెల్యేకు అందించారు. గత ఎన్నికల్లో ధనుంజయ నాయుడు తన గ్రామంలో వైసిపికి అనుకూలంగా కూడా కొన్ని ఓట్లను రిగ్గింగ్ చేశారని వారు ఆరోపించారు. అటువంటి జంపింగ్ జిలానీలను, మాయగాళ్లను ఇప్పుడు టిడిపిలోకి రావడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గరుగుబిల్లి మాజీ ఎంపిపి మర్రాపు పురుషోత్తమ నాయుడు, అక్కేన మధుసూదన్ రావు, తదితర నాయకులు ఉన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొమరాడ

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచిన విశాఖపట్నంలో పనిచేస్తున్న సిఐ జి.రవిని పలువురు అభినందిస్తున్నారు. మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతున్న పేద విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గులిపిల్లి సూర్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమారుడు గల్లిపిల్లి రవికుమార్ రూ.5 వేలు బహుమతిగా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఆర్థిక సహాయం చేసిన నగదును హెచ్ఎం ఐ.శ్రీనివాస రావు, పిడి ఎం.మురళీకృష్ణ, ఉపాధ్యాయుల సమక్షమలో విద్యార్థులకు అందించారు.

ఎక్కడా పంట నష్టం జరగలేదు

ప్రజాశక్తి - మక్కువ

తుపాను కారణంగా మండలమంతా ప్రశాంతంగా ఉందని, ఇప్పటి వరకు ఎక్కడా పంట నష్టం గానీ, ఇళ్లు కూలడం వంటి అపశృతులు జరగలేదని తహశీల్దార్ షేక్ ఇబ్రహీం శుక్రవారం తెలిపారు. నదుల ప్రవాహాలపై ఎప్పటికప్పుడు అటు అధికారులను ఇటు ప్రజలను అప్రమత్తం చేస్తూ వస్తున్నామన్నారు. ఒడిశాలో వరద ఉధృతి ఎక్కువైనా ఇక్కడకు సమాచారం వస్తుందని, దీంతో వెంటనే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామని ఆయన తెలిపారు.

యువ ఐఎఎస్ అధికారిని పిఒగా నియమించాలి

కురుపాం : యువ ఐఎఎస్ అధికారిని పార్వతీపురం ఐటిడిఎ పిఒగా నియమించాలని టిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలే జిల్లాకు బదిలీపై వచ్చిన యువ ఐఎఎస్ అధికారిని బదిలీ చేయడం అన్యాయమన్నారు. గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి గిరి శిఖర గ్రామాల్లో విద్య, వైద్య, మౌలిక సదుపాయాలు లక్ష్యంగా పనిచేసే అవకాశం ఉంటుందని అనానరు. వీరికి మొదటి దశలో సమాజానికి ఎంతో సేవ చేయాలనే తపనతో వస్తారని, కావున ప్రాజెక్ట్ అధికారిగా యువ ఐఎఎస్ ఆఫీసర్ నియమించేలా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణి చొరవ తీసుకోవాలని అన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - బలిజిపేట

బలిజిపేట కళింగవైశ్య భవనంలో శుక్రవారం పౌష్టికాహార మాహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వివిధ అంగన్వాడీ కేంద్రాల గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేసి, సీమంతాలు నిర్వహించారు. కార్యకర్తలు ఇంటి వద్ద తయారు చేసి తీసుకొవచ్చిన వివిధ పిండి వంటకాల స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించి వాటి రుచులను చూశారు. అనంతరం వాటిని గర్భిణులకు, బాలింతలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందజేస్తే పుట్టిన పిల్లలకు అంగవైకల్యం సంక్రమించందన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ సులేఖ, సర్పంచి రాగలత, మండల టిడిపి అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, నాయకులు రవిమాస్టర్, సాయికుమార్, పాపినాయుడు, అప్పారావు, రౌతు వేణుగోపాలరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణ, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం సక్రమంగా అందేటట్లు చూడాలని మండల ప్రత్యేక అధికారి ఎన్.రమేష్ రామన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల రక్షణ చట్టాలు, హక్కులు, పోషకాహారం సరఫరా పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారం నివారణకు అవరమైన పోషకాహారం అందిస్తున్నదని, వారి రక్షణకు అనేక చట్టాలు అమలు చేస్తున్నదని వాటిపై ప్రచారం చేసి ప్రజలకు తెలియజేయాని తెలిపారు. సిడిపిఒ బి.శ్రీనివాసరావు పోషణ్ మాహ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి వై.విమల కుమారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారి ఎన్.రాజ్యలక్ష్మి, ఇన్చార్జి డిఎంఅండ్‌హెచ్ఒ కె.ఉషారాణి, ఐసిడిఎస్ ఎపిఒ కె.శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీలు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌నగరంలో....

మండలంలోని ఎంఆర్ నగరం పౌష్టికాహార మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ వంగపండు లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అంగన్వాడీ సూపర్వైజర్లు బాలింతలకు, గర్భిణీలకు రక్త హీనత నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్త హేమలత పాల్గొన్నారు.

మక్కువ : అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ రాణి

మక్కువ: మండలంలోని పనసభద్రలో పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు, కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, పనసభద్ర సర్పంచ్, సిడిపిఒ బి.అనంతలక్ష్మి, సూపర్వైజర్లు లీలావతి, రాజశ్రీ, సచివాలయ సిబ్బంది, పలువురు గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని తోణాం పంచాయతీ దిగువ మెండెంగిలో అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త హారిక నారాయణమ్మ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువల అధికంగా వుండే ఆహార పదార్థాల గురుంచి వివరించారు. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలో వున్న అంగన్వాడీ కార్యకర్తలు,గర్భిణీలు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక నియోజక వర్గ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మట్టి విగ్రహాలతోనే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చున్నారు. రంగులతో కెమికల్స్‌తో కూడిన విగ్రహాల వల్ల పర్యావరణం, వాతావరణం పూర్తిగా కలుషితమవుతుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి లీగల్ అడ్వైజర్ మజ్జి వెంకటేష్, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి జగదీష్, ఉపాధ్యక్షులు గేదెల సర్వేశ్వరరావు,కార్యదర్శి వావిలపల్లి సూర్యనారాయణ, నియోజకవర్గ ఇన్చార్జి బోటు రామకష్ణ, టిడిపి నాయకులు డాక్టర్ గరిమెళ్ళ భాను ప్రసాద్, రౌతు వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు..

సీతానగరం : ఎల్‌విఆర్ సేవా సంస్థ ద్వారా పెదబాబుల మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ కంకణపల్లి అరవింద్ ఆధ్వర్యంలో స్థానిక బోనెల విజయ్‌చంద్ర సీతానగరంలో మట్టి వినాయక ప్రతిమలను సాలా హరిబాబు ఆధ్వర్యాన అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెంట సత్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి రౌతు వేణు నాయుడు, స్థానిక సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ గరికయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బలిజిపేట : మండలంలోని తుమరాడలో జనసేన ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. బాబు పాలూరు ఆధ్వర్యంలో జనసేన నాయకులు పడాల జయరాం, మర్రాపు సురేష్, యడ్ల అప్పలనాయుడు, నమ్మి భాస్కరరావు విగ్రహాలను పంపిణీ చేశారు.

మక్కువ : జనసేన సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషి ఆధ్వర్యాన మక్కువ జంక్షన్‌లో 500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సుగుణేశ్వరరావు, బిసి సెల్ కో-ఆర్డినేటర్ బి.పాపారావు, ఎస్సీ సెల్ కో-ఆర్డినేటర్ బంగార్రాజు, సీనియర్ నాయకులు రహీం, విశ్వేశ్వరరావు, వినోద్ కుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించరాదు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వర్తక వ్యాపార వాణిజ్య సంస్థలతో పాటు ఇతర ఏ సంస్థల్లోనూ బాల కార్మికుల వ్యవస్థను ప్రోత్సహించరాదని ఫస్ట్ క్లాస్‌అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సౌమ్య జోసెఫిన్ అన్నారు. మండలంలోని వెంకంపేట కూడలిలో మండల న్యాయ అవగాహన సదస్సు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ప్రజలకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, దేశంలోని పౌరులు విద్యావంతులుగా వెలుగొందడానికి బాల కార్మిక వ్యవస్థ ఒక ఆటంకంగా మారిందని, దీన్ని నిర్మూలించాలని అన్నారు. బాల కార్మిక వ్యవస్థను వ్యతిరేకించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిలోనూ ఉందని, అందుకు ప్రజలంతా సహకరించాలని అన్నారు. బాలా కార్మికులను ఎవరైనా ప్రోత్సహిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

పిహెచ్‌సిని పరిశీలించిన డిడిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ టి.జగన్మోహనరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్యాధికారులకు సూచించారు. ఒపి రికార్డులో నమోదు చేసిన రోగుల ఆరోగ్య తనిఖీల వివరాలు పరిశీలించారు. అందులో ఎక్కువగా శ్వాస సంబంధిత సమస్యలు నమోదు కావడంపై వైద్యాధికారి తో మాట్లాడి వారికి అందజేస్తున్న చికిత్స తదుపరి పర్యవేక్షణ వివరాలపై అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు ప్రభావం గ్రామాల్లో ఎక్కడైనా ఉందా అని ఆరోగ్య పర్యవేక్షకులను ఆరా తీశారు. జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికల వివరాలను ఎప్పటికప్పుడు వైద్యాధికారి తెలియజేయాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచించారు. మందుల నిల్వలను తనిఖీ చేసి వాటి కాల పరిమితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, తక్కువ కాల పరిమితి ఉన్న మందులను ముందుగా సద్వినియోగం చేయాలని సూచించారు. అత్యవసర చికిత్సకు ప్రాథమికంగా అవసరమైన ఇంజక్షన్లు, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ సిబ్బందితో సమీక్ష జరిపి ఆరోగ్య పర్యవేక్షకులు ప్రతి రోజూ క్షేత్ర స్థాయి సందర్శనలు చేసి అక్కడ వైద్య సిబ్బంది పని తీరును గమనించాలని అన్నారు. వ్యాధులకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలపై, అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. అన్ని వేళలా సిబ్బంది పిహెచ్‌సిలో అందుబాటులో ఉండాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ పావని,సూపర్వైజర్స్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

చూశారు... స్పందించారు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పయ్యపేట వద్ద ప్రధాన రహదారి జలమయమైంది. గెడ్డ ఉప్పొంగడంతో రోడ్డు మీదగా వరద నీరు ప్రవహించింది. అటుగా వస్తున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఈ దృశ్యాన్ని చూశారు. తక్షణం ఆ ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలకు గ్రామస్తులతో చేయికలిపారు. ప్రధాన రహదారి ముంపు కారణాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పైన భారీగా వర్షం కురుస్తుండడంతో గెడ్డ ఉప్పొంగిందని, దీంతో ప్రధాన రహదారిపైకి నీరు చేరిందని గ్రామస్తులు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యేను స్థానికులు కొనియాడారు

పివిటిజల్లో మా గ్రామాలను చేర్చాలి

ప్రజాశక్తి - కురుపాం

పివిటిజిల్లో లేనిటువంటి గ్రామాలను వెంటనే అందులో చేర్చాలని ఎస్ సొసైటీ సంస్థ డైరెక్టర్ ఎస్‌కె గౌస్ ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో పిఎం జన్‌మాన్ కార్యక్రమంలో జరుగుతున్న గ్రామ సభల్లో తమ బృందంతో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో బియ్యాలవలస, మండ పంచాయతీలు పరిశీలించగా బియ్యాల వలస పంచాయతీలో 4 గ్రామాలు పూర్తిగా పివిటిజి సవర తెగకు చెందిన 153 కుటుంబాలు, అలాగే మండ పంచాయతీ 3 గ్రామాలు 110 కుటుంబాలు ఉండగా వీరంతా సవర కులానికి చెందినవారని కానీ పీవీటిజిల్లో లేరని అన్నారు. ఈ గ్రామాలు ఎందుకు లేవని ఎంపిడిఒను అడగ్గా ఐటిడిఎ వారు పంపిన జాబితాలో ఇవి లేవని, పిఒను అడిగితే ఎంపిడిఒ పంపిన జాబితే తాము అమలుపరుస్తున్నామని అంటున్నారని అన్నారు. ఏదిఏమైనా కేంద్ర ప్రభుత్వం పథకాలకు పివిటిజీలు దూరమవుతారని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ యాప్ క్లోజ్ చేశారని, గ్రామాలు చేరిక కుదరదని అంటున్నారని అన్నారు. దీంతో మరి ఈ గ్రామాల ప్రజలు పథకాలు కోల్పోవడం అటుంచితే వీరు రానున్న రోజుల్లో అస్తిత్వం కోల్పోతారేమోనని ఆందోళన చెందుతున్నారని, కావున సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఈ గ్రామాలను పీవీటిజిల్లో చేర్పించేలా కృషి చేయాలని కోరారు.

ఆర్ఎస్‌కు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ఆర్ఎస్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సిపిఎం సీనియర్ నేత ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మరణం సిపిఎంకు తీరనిలోటని సిపిఎం నాయకులు అన్నారు. పట్టణంలోని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిపిఎం సీనియర్ నాయకులు, ఉద్యమ నిర్మాతల్లో ప్రముఖులు, కమ్యూనిస్టు యోధుడు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణరాజు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సిపిఎం తరుపున సుదీర్ఘంగా పనిచేశారన్నారు. సేవలను కొనియాడుతూ ఆయన మరణం పార్టీకి, పీడిత ప్రజానీకానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.ఇందు, వెంకట్రావు, పెంటయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ. 70 వేలు వితరణ

ప్రజాశక్తి-పాలకొండ

వరదలకు అతలాకుతలమైన విజయవాడ వాసులకు తమ సహాయార్థం పాలకొండ పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) ఆధ్వర్యంలో మహిళా సంఘాలు ద్వారా రూ.70వేలు సేకరించి స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చేతుల మీదుగా డిజాస్టర్ రిలీఫ్ ఫండ్‌కు చెక్ ద్వారా పంపించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, మెప్మా సిఎంఎం కృష్ణారావు, సిఒ దానాలమ్మ, లలిత, సిఎఫ్ తేజవతి, నాయకులు అంపోలు శ్రీనివాసరావు, దుప్పాడ వెంకటరమణ, ఉదయాన పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

విజయవాడ వరద బాధితులకు సహాయార్థం విరాళాలిచ్చి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, సహాయకార్యదర్శి తోట జీవ కోరారు. ఈ మేరకు పట్టణంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, కె.త్రినాథ్, బి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

9న జాబ్ మేళా

ప్రజాశక్తి - వీరఘట్టం

పార్వతీపురంలోని ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఈనెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపిడిఒ వై.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు కెవెల్ గ్రూప్, అమెజాన్ సంస్థ వారు హాజరుకానున్నారని, సుమారు 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన వారికి కనీస వేతనం రూ 18వేలు, పదో తరగతి ఉత్తీర్ణత పొంది యువతీ యువకులు, 30 ఏళ్లలోపు వారి వీటికి అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు 8978878557, 9494777553 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పచ్చని పుడమిని భావితరాలకు అందిద్దాం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పచ్చని పుడమిని భావితరాలకు అందిద్దామనిమున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ అన్నారు. శుక్రవారం కొత్తవలస శివారులో ఆరో వార్డులో గల నవిరి కాలనీలో ఐఆర్‌పిడబ్ల్యుఎ సంస్థ ఆధ్వర్యంలో జరిగే మొక్కలు నాటే కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిల్ సభ్యులు మజ్జి పారినాయుడుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పచ్చని పుడమని భావితరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతేకాకుండా పర్యావరణ మార్పు వల్ల నేడు అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నాయని, అందుకే విద్యార్థి దశ నుంచి మొక్కలు నాటే కార్యక్రమం అలవాటు చేసి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరో వార్డ్ కౌన్సిలర్ మజ్జి పారినాయుడు మాట్లాడుతూ నేటి యువతీ యువకులు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఈ సందర్భంగా జయబాబు వివిధ పండ్ల జాతి మొక్కలు, మెడిసిన్ ప్లాంట్లు మహిళా గ్రూప్ సభ్యులకు అందజేశారు. గణపతి పూజలో కూడా పర్యావరణను కాపాడేలా మట్టి గణపతి విగ్రహాలను వ్రతం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవిరి కాలనీ మహిళా సంఘ సభ్యులు విద్యార్థులు, నవిరి, కాలనీ పెద్దలు, ఐఆర్‌పిడబ్ల్యుఎ సంస్థ డైరెక్టర్ ప్రకాష్, సిబ్బంది సత్యనారాయణ గణేష్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థినికి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బురిడి ప్రియపూజిత ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఎఐ) అకాడమీ వారు విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో ఎంపిక నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో 12 మంది వాలీబాల్ క్రీడాకారులను ఎంపిక చేశామని, ఇందులో కోటిపాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని ప్రియ పూజిత ఎంపిక కావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల క్రీడాసక్తి పెంపొందించి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మురళీకృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినితో పాటు పిడి ఉపాధ్యాయులను, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నాణ్యమైన విత్తనానికి రైతే బ్రాండ్ అంబాసిడర్

ప్రజాశక్తి - పాచిపెంట

అధిక దిగుబడికి అతి ముఖ్యమైంది కల్తీ లేని నాణ్యమైన జన్యు స్వచ్ఛమైన విత్తనమేనని, విత్తన నాణ్యత సంరక్షణ కూడా రైతు చేతిలోనే ఉందని డిఆర్‌సి సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్యామల గౌరీపురంలో శుక్రవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూడు దశల్లో కేలీలను ఏరి వేయడం ద్వారా రైతు తన పొలంలోనే నాణ్యమైన వరి విత్తనాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. అలా తయారైన విత్తనాన్ని బాగా ఆడబెట్టి విత్తన శుద్ధి చేసి నిల్వ చేసుకుని కావాల్సినప్పుడు నారు పోసుకోవచ్చని తెలిపారు. పిలక, పొట్ట, కంకి దశల్లోనూ చివరగా కేలీలను తీసివేసి విడిగా నూర్పు చేసుకుని విత్తనాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఎంటియు 1064 రకం విత్తన ఉత్పత్తి పథకంలో భాగంగా 50 శాతం సబ్సిడీపై 7.5 క్వింటాళ్ల విత్తనాలు అందజేసినట్టు తెలిపారు. విత్తనశుద్ధికి రైతులకు సహాయ సహకారాలు అందించాలని విఎఎ నాగమణిని ఆదేశించారు. ఎరువులు విచక్షణారహితంగా వాడకుండా మట్టి నమూనా విశ్లేషణ ఫలితాల ఆధారంగా వేసుకోవాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ సిబ్బంది పనితీరును సమీక్షించగా రైతులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తెగుళ్లను, పురుగులను గుర్తించి సరైన సస్యరక్షణ చేపట్టాలని, వాతావరణాధిత వ్యవసాయాన్ని రైతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, ప్రకృతి సేద్య ఎల్‌టు విజయ్, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా శుక్రవారం రంగంపేటలో నేరుగా వెదజల్లే పద్ధతిలో వేసిన వరి పంటను మండల వ్యవసాయ అధికారి అయిన ఎస్ అవినాష్ పరిశీలించారు. ఈ పద్ధతి వల్ల కూలీ ఖర్చు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. ముందుగా భూమిని రెండు, మూడు సార్లు దుక్కి దున్ని చదును చేసుకొని 10-15 కేజీల విత్తనాలు చల్లాలన్నారు. ఈ పద్ధతిలో వరి విత్తనాలు ముందుగా శుద్ధి చేసుకోవాలన్నారు. అలాగే కలుపు నివారణకు తీసుకోవాల్సి చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : వరికి ఈ సీజన్లో వచ్చే తెగుళ్ల పట్ల ఎప్పటికప్పుడు రైతులు తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ పండా తెలిపారు. మండలంలోని పెదపదంలో వరికి సోకే తెగుళ్లపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎ శ్రీనివాసరావు, రస్తాకుంటుబాయి కెవికె శాస్త్రవేత్త అమృతి వీణ వరి పొలాలను పరిశీలించి, గ్రామంలో పంటల సాగును అడిగి తెలుసుకున్నారు. వరికి సోకే వివిధ తెగుళ్ళ, వాటి నివారణ గూర్చి రైతులకు వివరించారు. కార్యక్రములో ఎడిఎ మధుసూధన్, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ , విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్‌టిసి బస్సు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పణుకువలస వద్ద శుక్రవారం ఆర్‌టిసి బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. దీనిపై సీతానగరం పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పణుకు పేటకు చెందిన ఒమి సాంబమూర్తి(74) తన గ్రామం నుంచి కాశీపేట జంక్షన్ వద్ద ఉన్న చికెన్ సెంటర్‌కు రోడ్డు దాటి వెళ్తుండగా పార్వతీపురం నుండి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఆయన్ను స్థానికుల సహాయంతో 108 వాహనంలో బొబ్బిలి హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ మేరకు ఆయన అల్లుడైన ఎం.వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రమేష్ తెలిపారు.

ఘాట్‌రోడ్డులో వ్యాన్ బోల్తా

డ్రైవర్ మృతి, మరో డ్రైవర్ కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద ఆంధ్రా - ఒడిస్సా ఘాట్ రోడ్‌లో గురువారం రాత్రి వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ షోయబ్ అహ్మద్ ఖాన్ (29) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో డ్రైవర్ శంకర్ రతన్ పటోకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులందించిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన ఈ ఇద్దరు వ్యక్తులు ఛత్తీష్‌ఢ్ నుంచి వ్యాన్‌లో కమలా పండ్లలోడుతో రాజాం మీదుగా శ్రీకాకుళం బయలుదేరింది. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఆంధ్ర ఒడిస్సా ఘాట్ రోడ్డులో వ్యాను అదుపుతప్పి కొండను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనలో సోయిబ్ అహ్మద్ ఖాన్ అక్కడికక్కడే మృతి చెందగా, శంకర్ రతన్ కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని సాలూరు సిహెచ్‌సికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించి కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి కృపారావు తెలిపారు.

బోల్తాపడిన పండ్ల వ్యాన్
(ఇన్‌సెట్‌లో మృతి చెందిన డ్రైవర్ అహ్మద్‌ఖాన్)